## క్లుప్తంగా

### గౌడ కులస్తుల అభివృద్ధికి కృషి చేద్దాం



అంజయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: గౌడ కుల హక్కుల సాధన కోసం అందరం కలిసి కృషి చేసుకుందామని సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రేనుట్ల మల్లేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు నక్కలపల్లి అంజయ్యగౌడ్‌లు పేర్కొన్నారు. మండల పరిధిలోని కనకమామిడి సమీపంలో గల ఓ వ్యవసాయ క్షేత్రంలో నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గౌడ కుల సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొని అంజయ్యగౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎగిలని వెంకటేశ్‌గౌడ్, నర్సింహగౌడ్, శ్రీశైలంగౌడ్, వివిధ గ్రామాల గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలకు బ్యాండ్‌సెట్



ఉపాధ్యాయులకు బ్యాండ్ సెట్ అందజేస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ ప్రాథమిక పాఠశాలకు మంగళవారం గ్రామస్తుడు ఉమ్మెంతాల నర్సింలు బ్యాండ్‌సెట్ బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అనురాధ మాట్లాడుతూ.. ప్రార్థన సమయంలో విద్యార్థులకు బ్యాండ్ సెట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నర్సింలును ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవేందర్ రెడ్డి, సునిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఎస్ఎఫ్ఐ కమిటీ ఎన్నిక



కమిటీకి నియామకపత్రం అందజేస్తున్న అరుణ్‌కుమార్

షాబాద్: దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేశామని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నామని ఆయన తెలిపారు. అధ్యక్షుడిగా భానుప్రసాద్, కార్యదర్శిగా ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్, సహాయ కార్యదర్శి అఖిల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొని, ఈ మేరకు వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బేగరి తేజ, చందు, తబ్రేశ్, కిషోర్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

### ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

డీపీఎం స్వర్ణలత



మాట్లాడుతున్న డీపీఎం స్వర్ణలత

కొందుర్గు: ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అందిస్తున్న పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని డీపీఎం స్వర్ణలత సూచించారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సంగీత అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సమాఖ్య సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి చిరువ్యాపారాల నిర్వహణ కోసం మహిళా శక్తి పథకం ద్వారా రుణాలను అందిస్తున్నామన్నారు. మండలంలో 305 మందికి రుణాలు అందించేందుకు లక్ష్యం నిర్దేశిస్తే 306 మంది ముందుకురావడం అభినందనీయమన్నారు. చిరువ్యాపారాలను నెలకొల్పి అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. సమావేశంలో ఏపీఎం జయమాలిని, మండల మహిళా సమాఖ్య కార్యదర్శి వీరమణి, కోశాధికారి అపర్ణ, సీసీలు సరళ, లక్ష్మి, జంగయ్య పాల్గొన్నారు.

### డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి పక్కన బావర్చి హోటల్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను మున్సిపల్ అధికారులు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. గతంలో ఉన్న డ్రైనేజీ పైపులైన్ ధ్వంసం కావడంతో హోటళ్లు, ఇళ్ల నుంచి వెళ్లే మురుగు నీరు సక్రమంగా పారడం లేదన్నారు. కొన్ని ఇళ్లలో నుంచి నీరు పైపుల నుంచి లీకై రోడ్లపై పారుతోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# అధ్వాన రోడ్లతో అవస్థలు

- బాకారం–కాశీంబౌలి వరకు పూర్తిగా గుంతలమయం
- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం
- వాహనదారులు, ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



అధ్వానంగా బాకారం రోడ్డు



గుంతలమయంగా ఎన్కెపల్లి రోడ్డు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. రాత్రి సమయంలో రోడ్లపై రాకపోకలు నిర్వహించాలంటే వాహనాదారులు జంకుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా పాలకులు మారుతున్నారే తప్పా రోడ్ల మరమ్మతులపై అధికారులు స్పందించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు, వాహనాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్లకు కనీసం గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

**అడుగడుగునా గుంతలే..**

మండల పరిధిలోని బాకారం–కాశీంబౌలి, బాకారం–ఎన్కెపల్లి, బాకారం–నాగిరెడ్డిగూడ వరకు వెళ్లే దారులు గుంతలమయంగా మారడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. దీంతో వాహనాదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఎన్కెపల్లి–బాకారం రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి కానీ పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా బాకారం గ్రామానికి వచ్చే మూడు వైపులా రోడ్లపై పడిన గుంతలను పూడ్చి మరమ్మతులు చేయించాలని వాహనాదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**నిధులు మంజూరయ్యాయి**

మండల పరిధిలోని ఎన్కెపల్లి–బాకారం రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. టెండర్ కాగానే రోడ్డు పనులు ప్రారంభిస్తారు. అదేవిధంగా అజీజ్‌నగర్ నాగిరెడ్డిగూడ బాకారం రోడ్డును పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం.

–విజయ్‌కుమార్, ఆర్అండ్‌బీ డీఈ

**మరమ్మతులు చేపట్టాలి**



కాశీంబౌలి–బాకారం రోడ్డుపై వెళ్లాలంటే ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. మొదలే సింగల్ రోడ్డు ఈ రోడ్డుపై అడుగడుగునా గుంతలు గత 20 ఏళ్ల క్రితం వేసిన ఈ రోడ్డు నేటికీ కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. మరమ్మతులు చేపట్టకపోవడంతోనే ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

–కొత్తపల్లి తిరుపతిరెడ్డి, బాకారం

**గుంతలు పూడ్చాలి**



ఎన్కెపల్లి–బాకారం రోడ్డు గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. కనీసం గుంతలు పూడ్చి మరమ్మతులు చేయించాలి. నిధులు మంజూరైనా రోడ్డు నిర్మించడం లేదు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటే నరకంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాకారం వచ్చే ఇరువైపులా రోడ్లకు మరమ్మతులు చేయించాలి.

–నారాయణపురం మహేందర్‌ముదిరాజ్, బాకారం

## ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించొద్దు

- ట్రాఫిక్ సీఐ ఎస్ వెంకటేశం
- చిరువ్యాపారులకు అవగాహన, రోడ్డు క్లియరెన్స్‌కు సూచనలు



చేవెళ్లలో చిరువ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశం

చేవెళ్ల: మండల కేంద్రంలో ఉన్న ప్రధాన రోడ్డుకిరువైపులా ఉన్న చిరువ్యాపారులు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించొద్దని దుకాణాలను లోపలి వైపునకు పెట్టుకోవాలని ట్రాఫిక్ సీఐ ఎస్.వెంకటేశం సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం ప్రధాన రోడ్డుపై, ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు సమీపంలో ఇరువైపులా ఉన్న చిరువ్యాపారుల దుకాణదారులకు ట్రాఫిక్ సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, పాదాచారులకు ఇబ్బంది లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న పండ్లు, పూల దుకాణాలు రోడ్డుపైకి వచ్చాయని వీటితో ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఈ దుకాణాల ముందు పండ్లు కొనేందుకు వాహనం ఆపితే రోడ్డుపై వాహనాలు నిలిచిపోతున్నాయని తెలిపారు. దుకాణం ముందు వాహనం నిలుపుకునేందుకు స్థలం ఉండాలన్నారు. అప్పుడే రోడ్డుపై వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది ఉండదని చెప్పారు. ఏ వ్యాపారం అయినా తప్పనిసరిగా రోడ్డుపై వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా నడిపించుకోవాలని సూచించారు. అందరూ సహకరించాలని కోరారు. లేదంటే వారిపై చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది శంకర్, నరేశ్, జంగయ్య, ప్రవీణ్, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

**నిబంధనలు తప్పనిసరి**

డ్రైవింగ్ లైసెన్స్, నెంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని ట్రాఫిక్ సీఐ వెంకటేశం, సివిల్ ఎస్ఐలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్‌లు అన్నారు. మండలంలో మంగళవారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు, సివిల్ పోలీసులు వేర్వేరుగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రోడ్డుపై తిరిగే వాహనాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్‌లు లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి వారిని హెచ్చరించి అవగాహన కల్పించారు. ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. ఇక నుంచి ప్రతి రోజు చేవెళ్ల పరిధిలో తనిఖీలు ఉంటాయని తెలిపారు.

## ఎన్నికలతో నాయకత్వ లక్షణాలు పెంపు

హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి





ఓటు వేస్తున్న విద్యార్థులు

షాబాద్: ఎన్నికలు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని తాళ్లపల్లి హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తాళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ స్టూడెంట్ లీడర్–2024 ఎలక్షన్స్ నిర్వహించారు. విద్యార్థులందరూ తమ ఓటు హక్కును రహస్య బ్యాలెట్ పద్ధతిలో వినియోగించుకున్నారు. ఇలాంటి స్కూల్ స్థాయి మోడల్ ఎలక్షన్ ద్వారా ఎన్నికల ప్రక్రియ ఎలా ఉంటుందో విద్యార్థులు అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంచేందుకు ఇలాంటి ఎలక్షన్స్ ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. పాఠశాల లీడర్లుగా విద్యార్థులకు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగిరెడ్డి, సంఘమేశ్వర్‌రెడ్డి, కిరణ్మయి, శోభారాణి, మొగులయ్య, మంజుల తదితరులు ఉన్నారు.

## యువకులకు అందుబాటులో పుస్తకాలు

ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



లైబ్రరీలో పుస్తకాలను పరిశీలిస్తున్న రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువకుల కోసం లైబ్రరీలో అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆయన పరిశీలించి, అనంతరం మాట్లాడుతూ.. ఎగ్జామ్స్‌కు సిద్ధం అవుతున్న విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని 300లకుపైగా కరెంట్ అఫైర్స్ పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల కోసం మండల కేంద్రంలోని గ్రంథాలయంతో పాటు మండల పరిధిలోని నిర్దవెల్లి, వేములనర్వ గ్రామాల్లో ఉన్న గ్రంథాలయాల్లో ఉదయం 9 నుంచి 1 గంట వరకు మళ్లీ 2 నుంచి 5 గంటల వరకు తెరచి ఉంచుతామన్నారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీనివాసులు, కేశంపేట పంచాయతీ కార్యదర్శి విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

### నేడు చేవెళ్ల బంద్, ర్యాలీకి హిందూ సంఘాల పిలుపు

చేవెళ్ల: బంగ్లాదేశ్‌లో హిందువులు, భారతీయులపై జరుగుతున్న దాడులను ఆపాలని హిందూ సంఘాల అఖిల పక్షం నాయకులు కోరారు. మంగళవారం మండలంలోని వాట్సాప్ గ్రూప్‌ల వేదికగా హిందూ సంఘాల పేరుతో నేడు చేవెళ్ల బంద్‌కు సహకరించాలని కోరుతూ ప్రచారం చేశారు. బంగ్లాదేశ్‌లో భారతీయులు, హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి హిందూ సంఘాల అఖిల పక్షం నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి చేవెళ్లలోని అన్ని వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు సహకరించి ర్యాలీలో పాల్గొనాలని కోరారు. ఇది అందరి బాధ్యతగా భావించి రావాలని బీజేపీ నాయకులు అనంత్‌రెడ్డి కోరారు.

### కళాశాలకు స్పోర్ట్స్ పరికరాల అందజేత



స్పోర్ట్స్ పరికరాలను అందజేస్తున్న యువసైన్యం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి యువసైన్యం ఆధ్వర్యంలో మంగళవారం స్పోర్ట్స్ పరికరాలను అందజేశారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అందించేందుకు స్పోర్ట్స్ పరికరాలను ఇచ్చినట్లు యువసైన్యం నాయకులు తెలిపారు. కళాశాలలో నిర్వహించే కార్యక్రమాలకు, విద్యాభివృద్ధికి కావాల్సిన వసతులను కల్పించేందుకు తమవంతు సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ చెట్ల పావని నర్సింలు, సింగిల్‌విండో డైరెక్టర్ నందిగామ శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



భోజనాన్ని పరిశీలిస్తున్న డా.విజయలక్ష్మి తదితరులు

షాబాద్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గురుకుల బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినులకు పరిసరాల పరిశుభ్రత, హ్యాండ్‌వాష్ గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ తబసుమ్ మహారాజ్, హెల్త్ సూపర్‌వైజర్ మెర్లిన్, ఏఎన్ఎం లక్ష్మి, ఆశవర్కర్లు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా భోజనాన్ని పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు కాస్మోటిక్స్ చార్జీలను పెంచాలన్నారు. అద్దె భవనంలో కొనసాగుతున్న వసతి గృహాల విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వసతి గృహాలకు ప్రభుత్వం సొంత భవనాలను కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సభ్యుడు భగత్, నాయకులు సాయితేజ, తుశాల్, కౌశిక్, హరి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్టీసీని వినియోగించుకునేందుకు కృషి



విద్యార్థినులతో దాత సుదర్శన్, ఉపాధ్యాయులు

చేవెళ్ల: ఆర్టీసీ సేవలను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకునేలా వారికి ఫ్రీ బస్‌పాస్‌లను అందించేందుకు దాత ముందుకురావడం అభినందనీయమని హెచ్ఎం ఉమామహేశ్వరీ అన్నారు. మండలంలోని ఆలూరులో మంగళవారం ఉన్నత పాఠశాల విద్యార్థినులకు గ్రామానికి చెందిన దాత సుదర్శన్ ముందుకొచ్చి విద్యార్థినులందరికీ పాసులకు అయ్యే కార్డు ఫీజులను చెల్లించి ఫ్రీ బస్‌పాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం ఉన్నా విద్యార్థినులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకొని రావాల్సి ఉంటుందని ఆధార్‌కార్డును చూసి జీరో టికెట్‌ను ఇష్యూ చేయాల్సి ఉంటుందన్నారు. దీనికి బదులుగా విద్యార్థులకు ఫ్రీ బస్‌పాస్‌ను అందించేలా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఏడాది కాలానికిగాను కార్డుకు అయ్యే నామమాత్రపు ఫీజును చెల్లించి పాఠశాలలోని విద్యార్థినులందరికీ ఫ్రీ బస్‌పాస్‌ను ఇప్పించామన్నారు. దీంతో విద్యార్థులు బస్‌పాస్ చూపిస్తే సరిపోతుందని వీరికి టికెట్ కూడా జారీ చేయరని చెప్పారు. ఈ సౌకర్యం విద్యార్థులకు ఎంతో వెసులుబాటుగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ వీబీఓ ఎం.రవీందర్, సి.బాల్‌రాజ్, అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు మహేశ్, సభ్యులు కుమార్, బెన్నీ, సురేశ్, కుమార్, రాఘవు, నరేశ్, వెంకట్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

మాజీ సర్పంచ్ మధుసూదన్‌గుప్తా



హెచ్ఎం వెంకటయ్యను సన్మానిస్తున్న గ్రామ నాయకులు, యువకులు

చేవెళ్ల: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని దామరగిద్ద మాజీ సర్పంచ్ మధుసూదన్‌గుప్తా అన్నారు. మండలంలోని దామరగిద్దలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామస్తులు మంగళవారం ఇక్కడి నుంచి బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగత సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో పనిచేసిన హెచ్ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు శశికళ, శివశంకర్‌చారి, సరితలు ఎంతో పేరు తెచ్చుకున్నారన్నారు. పాఠశాల అభివృద్ధికి వారు ఎంతో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా వారికి గ్రామానికి చెందిన ఘనపురం శేఖర్, గ్రామ యువకులు ఘనంగా సన్మానించారు. కొత్తగా పాఠశాలకు వచ్చిన హెచ్ఎం ఎల్. సంగీత, ఉపాధ్యాయులు బాలాజీ, కిరణ్, అంజనేయులు, సుమజలకు స్వాగతం పలికి విద్యార్థులకు నాణ్యమైన విద్య ను అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ పాఠశాల చైర్మన్ తెలుగు అంజయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింలు, గ్రామ యువకులు, నాయకులు డి.మల్లేశ్, మహిపాల్, వై.మల్లేశ్, దివ్య, పూర్వ విద్యార్థులు అనిల్, రజినీకాంత్, ప్రదీప్, మహేందర్, శివ, ప్రకాశ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

## ఆర్థికసాయం అందజేత



నాగుర్లగడ్డతండాలో మృతురాలి కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామానికి చెందిన దర్శనం వెంకటయ్య సోమవారం మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో మంగళవారం అంత్యక్రియల కోసం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మల్లేశ్ యాదవ్, రమేశ్, మనోహర్‌గౌడ్, గోపాల్, నర్సింలు, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

**కేశంపేటలో..**

కేశంపేట గ్రామ శివారులోని నాగుర్లగడ్డతండాకు చెందిన శాంతి గుండెపోటుతో మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో ఆమె అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, గ్రామానికి చెందిన రమణయ్యగౌడ్‌లు రూ.5వేల చొప్పున, శ్రీకాంత్‌రెడ్డి రూ.3వేల ఆర్థికసాయానికి సంబంధించిన నగదును మృతురాలి కుటుంబ సభ్యులకు మంగళవారం అందించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, పాండుగౌడ్, తలసాని రమణారెడ్డి, శేఖర్‌రెడ్డి, కోడిపర్తి శ్రీకాంత్‌రెడ్డి, పాండునాయక్, రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హరేరామ హరేకృష్ణకు అప్పగించొద్దు

మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కేశంపేట: అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న కార్మికులను కాదని ప్రైవేట్ సంస్థకు నిర్వహణ బాధ్యతను అప్పగించొద్దని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు అన్నారు. ప్రైవేట్ వద్దు.. మధ్యాహ్న భోజన కార్మికులే ముద్దు అంటూ మండల కేంద్రంలోని మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట మంగళవారం కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అలివేలు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన బిల్లులను ఆరునెలలకొకసారి చెల్లించిన భోజనం అందించే విషయంలో ఎక్కడ రాజీ పడలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు పదివేల జీతం అందిస్తామని హామీ ఇచ్చింది, అధికారంలోకి వచ్చిన వెంటనే తమనే లేకుండా చేయాలని హరేరామ హరే కృష్ణ సంస్థకు అందిస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను నెరవేర్చకుండా తొలగించాలనుకోవడం సరికాదన్నారు. అనంతరం మండల విద్యాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాస్, మధ్యాహ్న భోజన కార్మికులు అక్కమ్మ, కళావతి, బాలమణి, నీలమ్మ, జ్యోతి, వసంత, సువర్ణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

సీఐ నర్సింహరావు

కొత్తూరు: సీసీ కెమెరాలతో నేరాలను అరికట్టవచ్చని సీఐ నర్సింహరావు అన్నారు. మండల పరిధిలోని కొడిచర్ల గ్రామంలో ఆయన తన సిబ్బందితో కలిసి మంగళవారం సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. ప్రస్తుతం నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. ప్రజలు, వ్యాపారులు తమ ఇంటి ఆవరణలో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అంతేకాకుండా శాంతి భద్రతల విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు, పండగలను ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.